

ముగ్గులను పరిశీలిస్తున్న టీజీ గ్రూప్స్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్



ముగ్గు వేస్తున్న యువతి

ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



అవనిపై హరివిల్లు

- మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు
- అట్టహాసంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- కర్నూలు, ఆదోనిలో ఉత్సాహంగా పోటీలు

రామపాదం సోకి రాయి రమణిగా మారిందనేది రామాయణ గాథ. ఇక్కడ రమణుల మునివేలి కొసలు తగిలిన ముగ్గు పొడులు మట్టిపై పడి మనోహర చిత్రాలుగా రూపుదిద్దుకున్నాయి. మహిళల సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి ముందే వచ్చిందా అనేలా సందడి నెలకొంది. మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులతో రంగుల హరివిల్లు రూపుదిద్దుకుంది.





కర్నూలు(కల్చరల్), జనవరి 7: ఇలలోని ఇంద్రధనుస్సు నేలపై ఒదిగినట్లు... ఆకాశంలోని తారలన్నీ పుడమిపై వాలినట్లు... విభిన్న వర్ణాలు, వినూత్న రూపాలుగా మారి వేనవేల శోభిత కాంతుల్లో మెరిసిపోయాయి. ముదితల మునివేళ్ల మధ్య జారువాలిన ముగ్గుపిండి... ధవళ కాంతుల మెరుపుల్లో రంగవల్లికలై కాంతులీనాయి. చుక్కను చుక్కనూ కలుపుకుంటూ మహిళలు సృజనాత్మకంగా తీర్చిదిద్దిన ముత్యాల ముగ్గులన్నీ సప్తవర్ణ శోభిత వర్ణాలుగా చక్కగా ఒదిగిపోయాయి. వారిలోని కళాత్మక భావాలకు ముగ్గుల పోటీలు వేదికగా నిలిచాయి. ఆదివారం 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు'తో పాటు స్థానిక స్పాన్సర్ టీజీవీ గ్రూప్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్ సౌజన్యంతో, మాంటిస్సోరి విద్యాసంస్థల సహకారంతో, ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేశారు. ఈ ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఉదయం 9 గంటలకే మహిళలు ఉత్సాహంగా చేరుకున్నారు. నిర్ణీత సమయానికి పోటీల్లో పోటాపోటీగా పాల్గొన్నారు. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలులో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు 225 మంది, ఆదోనిలో నిర్వహించిన పోటీలకు 60 మంది మహిళలు హాజరయ్యారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విజేతలకు కర్నూలులో టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు నగదు బహుమతులు అందించారు. అలాగే పదిమందికి కన్సొలేషన్ బహుమతులు, పోటీల్లో పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ బహుమతిని అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఎల్.లోకేశ్వరరెడ్డి, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ సుంకన్న, ఆంధ్రజ్యోతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులో ప్రథమ విజేతగా నిలిచిన రాజేశ్వరి



ఆదోని ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేత రాధిక

ఆదోనిలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ఆదోనిలో మహిళలు వేసిన ముగ్గులు

ఆదోని, జనవరి 7: ఆదోనిలో జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు' ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఆదోనిలో ఎన్‌డీబీఎల్ పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్ పరిశ్రమ అధినేత బత్తిన లక్ష్మీనారాయణ, హనుమంతమ్మ స్పాన్సర్స్‌గా సహకారం అందించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి డాక్టర్ బత్తిన సురేంద్రబాబు, బత్తిన కుబేర్‌నాథ్, మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రమేష్‌బాబు బహుమతులను అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా మణియం సుజాత, హెబ్బట్టం కిరణ్మయి, నీలం బండారిలు వ్యవహరించారు. ఆదోనిలో జరిగిన ముగ్గుల పోటీల్లో కె.రాధిక, పల్లవి, బి. రూప ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. అదేవిధంగా ఈరమ్మ, రమ్య, శృతి, ప్రసన్నలక్ష్మి, జ్యోతి, అనిత, సోమేశ్వరి, నాగవేణి, లావణ్యలు కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారు.



సృజనాత్మకతను వెలికితీసేందుకు చక్కని వేదిక

మహిళల్లో అంతర్లీనంగా దాగున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు చక్కని వేదికగా ఉపయోగపడతాయని టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని ఎ.క్యాంపు మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెండు గంటల పాటు మహిళలు ఎంతో శ్రమించి వేసిన ముగ్గులను ఆయన తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో టీజీ భరత్ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో సంక్రాంతి విశిష్టమైనదని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వేసే ముగ్గుల్లో సృజనాత్మకత దాగి ఉంటుందని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'వారు గత పదేళ్లకు పైగా ఏటా ముగ్గులపోటీలు విజయవంతంగా నిర్వహిస్తూ మహిళలల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి కలిగేలా కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. ముగ్గుల పోటీలు చూస్తుంటే ఇప్పుడే పండుగ ప్రారంభం అయిందన భావన కలుగుతోందని చెప్పారు.





విజేతలను సత్కరిస్తున్న టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ లక్ష్మణ్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, ఏబీఎన్ స్టాఫర్ సుంకన్న

9న జిల్లాకు నారా భువనేశ్వరి

- రెండు రోజులు 'నిజం గెలవాలి' పర్యటన
- చంద్రబాబు అరెస్టు సమయంలో మనోవేదనతో..
- మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- 15 కుటుంబాలకు ఆర్థిక సాయం పంపిణీ
- ఏర్పాట్లలో నియోజకవర్గం ఇన్‌చార్జిలు నిమగ్నం



కర్నూలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 9, 10న జిల్లాలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఆకెపోగు ప్రభాకర్, కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, పి.తిక్కారెడ్డిలు భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 9న టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఎం జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టింది. అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక పలువురు టీడీపీ కార్యకర్తలు, సీబీఎన్ అభిమానులు మనోవేదనతో మృత్యుఒడి చేరారని బీటీ నాయుడు ఆంధ్రజ్యోతికి వివరించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళ, బుధవారాల్లో ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి మృతి చెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 9వ తేదీ మంగళవారం ఉదయం 6:30 గంటలకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నుంచి బయలుదేరుతారు. ఉదయం 1:25 గంటలకు కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చేరుకొని మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని, 11 గంటలకు గూడూరు చేరుకొని బాబు అరెస్టును తట్టుకోలేకి మృతి చెందిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తారు. 11:10 గంటలకు కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2:10 గంటలకు పత్తికొండ నియోజకర్గం కృష్ణగిరి మండలం ఎర్రగుడి, 4:10 గంటలకు తుగ్గలి మండలం మిథెతండ, 4:40 గంటలకు కడమకుంట్ల గ్రామాల్లో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఓదార్చుతారు. రాత్రికి ఆదోనికి చేరుకుని మండగిరిలోని చేకూరి పుల్లయ్య ఫంక్షన్ హాల్‌లో బస చేస్తారు. 10వ తేదిన ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తారు.

భువనమ్మ పరామర్శించే కుటుంబాలు

టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపగిలి మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మహబూబ్‌భాషా, గూడూరులో షేక్షావలి, బోయ గౌరన్న, కోడుమూడు మండలం ప్యాలకుర్తి గ్రామంలో టీడీపీ కార్యకర్త నాగార్జుగౌడ్, పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామంలో పింజరి సుభాన్, తుగ్గలి మండలం మిథెతండ గ్రామంలో రమావత్‌లక్ష్మి, కడమకుంట్ల గ్రామంలో వడ్డే చిన్న రాముడు కుటుంబాలను తొలి రోజు 9న పరామర్శిస్తారు. 10వ తేది బుధవారం మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడుబూరులో గోపాల్, కౌతాళం మండలం కల్లూరు గ్రామంలో ఈరమ్మ, మంత్రాలయంలో తాయమ్మ, ఎమ్మిగనూరు నియోజకర్గం నందవరం మండలం ముగతి గ్రామంలో హనుమంతు, గోనేగండ్ల మండలంలో బి.అగ్రహారం గ్రామంలో సుధాకర్ నాయుడు, ఎర్రబాడు గ్రామంలో కౌలుట్ల, అలవాల గ్రామంలో ఈరన్న కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తారు. అనంతరం కర్నూలు చేరుకొని అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారని బీటీ నాయుడు తెలిపారు. రెండో రోజు పర్యటన షెడ్యూలు రావాల్సి ఉంది.

జీడీపీలో 1.2 టీఎంసీలు

వచ్చే వేసవిలో తాగునీటి పథకాలకు కష్టమే



గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న నీరు

గోనెగండ్ల, జనవరి 7: ఎల్లెల్సీ నుంచి మళ్లించిన నీరు గాజులదిన్నె ప్రాజెక్టులో 1.2 టీఎంసీలు మాత్రమే ఉంది. ఎల్లెల్సీ నుంచి గత 30 రోజులుగా రోజుకు 270 క్యూసెక్కుల నీరు గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా జీడీపీ మళ్లించారు. ఎల్లెల్సీ నీరు నిలిచిపోవడంతో ప్రాజెక్టుకు నీరు చేరడం ఆగిపోయింది. ఎల్లెల్సీ నీరులేక పోతే ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయేది. అప్పుడు ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీరు నిలిచిపోయే ది. అయితే ప్రస్తుతం జీడీపీలో ఉన్న 1.2 టీఎంసీల నీరు ఏప్రిల్, మే నెల వరకు తాగునీటి పథకాలకు సరిపోతాయని, జూన్, జూలై నెలల్లో తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ప్రాజెక్టు కట్ట ఎత్తు పెంచే పనులు ప్రస్తుతం జరుగుతుండటం, ఆరు క్రస్ట్ గేట్లను మరమ్మతు చేస్తుండటంతో ప్రాజెక్టులోని నీరు అంతా గత నాలుగు మాసాల క్రితమే కిందకు వదలాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కూడా కురవకపోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో వచ్చే వేసవిలో ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు(40 గ్రామాలకు తాగునీటి పథకం), డోన్, కిష్టగిరి, తాగునీటి పథకాలకు, అవసర సమయంలో కోడుమూరు, కర్నూలు, గూడురు, తదితర ప్రాంతాలకు తాగునీరు అందడం కష్టమే అని ఇరిగేషన్ అధికారులు ముందు చర్యగా ఎల్లెల్సీ నీటిని ప్రాజెక్టులోకి మళ్లించి 1.2 టీఎంసీలు నిలువ చేశారు. అయితే ఈ నీటితో వేసవి గండం తప్పేనా? అనే సందేహం కూడా ఉంది. ముందస్తు వర్షాలు వస్తే తాగు నీటి సమస్య రాకపోవచ్చునని అధికారులు అంటున్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులు వేయడానికి వచ్చిన మహిళల పేర్లను నమోదు చేసుకుంటున్న దృశ్యం





ముగ్గులోలికే...

- పుడమిని ముద్దాడిన ముత్యాల ముగ్గులు
- కర్నూలులో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- మహిళల నుంచి అనూహ్య స్పందన

'కెనరా బ్యాంక్ - ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ ఇనిస్టిట్యూట్ బెంగుళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు, కర్నూలులోని టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ ఛైర్మన్ టీజీ భరత్ సౌజన్యంతో, మాంటిస్సోరి విద్యాసంస్థల సహకారంతో ఆదివారం కర్నూలులో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని కలెక్టరేట్ వెనుకగల, ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

- కర్నూలు (కల్చరల్)



మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ లక్ష్మణ్



బహుమతులు అందజేస్తున్న టీజీ భరత్

● మహిళలను ప్రోత్సహించేలా ముగ్గుల పోటీలు



ఆంధ్రజ్యోతి వారు ప్రతి ఏటా మహిళలను ప్రోత్సహించేలా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలోనే ఈ పోటీల్లో పాల్గొన్నా. ప్రథమ బహుమతి రావడం ఇదే తొలి సారి. బహుమతిని ఊహించలేదు. కానీ నావంతు ప్రయత్నం చేశాను. ఈ బహుమతి నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. మహిళలంతా కలిసి కట్టుగా ఇలా ముగ్గులు వేయడం వల్ల వందల కొద్దీ కొత్త ముగ్గులను చూసినట్లు ఉంది.

- ఎస్. రాజేశ్వరి, ప్రథమ నగదు బహుమతి విజేత, కర్నూలు

● గతంలోనూ బహుమతులు సాధించా...



మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన ముత్యాల ముగ్గులు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే సంక్రాంతి ముందు నిర్వహించే ముగ్గుల పోటీలకు హాజరవుతుంటాను. నాకు గత ఏడాది ఆంధ్రజ్యోతివారు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. అలాగే 2017లో జిల్లాస్థాయిలో తొలి ప్రయత్నంగా ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రథమ బహుమతి అందుకున్నాను. బహుమతుల గురించి కాకుండా నేర్చుకున్న ముగ్గులతో నాలోని సృజనకు పదును పెట్టాలనే భావనతోనే ఏటా పోటీలకు వస్తున్నాను. ఈ ఏడాది నాకు ద్వితీయ బహుమతి రావడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

- ఆర్. గౌతమి, ద్వితీయ నగదు బహుమతి విజేత, కర్నూలు

● బహుమతి వస్తుందని ఊహించలేదు..



ముగ్గుల పోటీల వల్ల మహిళల్లోని ప్రతిభ వ్యక్తమవుతుందని భావించి పోటీలకు వచ్చాను. బహుమతి వస్తుందని ఊహించలేదు. కానీ సృజనాత్మకతకు ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందనే దానికి చక్కని ఉదాహరణగా ఈ ముగ్గుల పోటీలు నిలిచాయి. బహుమతుల గురించి పట్టించుకోకుండా పోటీలో పాల్గొన్నాను. నాకు తృతీయ బహుమతి రావడం మరింత సృజనాత్మకంగా ముగ్గులు వేయాలనే పట్టుదల కలిగేలా చేసింది.

- ఎస్. ప్రసన్నకుమారి, తృతీయ నగదు బహుమతి విజేత, కర్నూలు



ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు



ముగ్గుల వేసిన మహిళలు

ఆట పాటలతో డ్రైవర్ల నిరసన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 7: క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ ఎదుట చేస్తున్న సమ్మె ఆదివారానికి 22వ రోజుకి చేరింది. డ్రైవర్లు ఆట పాటలతో విన్నూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని, వీక్లీ ఆఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అగ్రిమెంటు ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాతబస్తీ అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, కుమార్, రఘుశేఖర్, నరేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

10న సీఎం కార్యాలయం ముట్టడి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 7: మెగా డీఎస్సీ విడుదల చేయాలని 10 సీఎం కార్యాలయం ముట్టడి చేయనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ తెలిపారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ అభ్యర్థులు అనేకసార్లు నిరసనలు, ప్రదర్శనలు, దర్నాలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. తాడోపేడో తేల్చుకోవడానికే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 10 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల సత్తా ఏమిటో జగన్‌మోహన్‌రెడ్డికి చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, శిరీష, వీరేష్, నవీన్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 7: నగరంలోని 7వ వార్డు 19వ సచివాలయం పరిధిలోని ఖజాహుస్సేన్‌కు ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ చేసారు. ఇటీవల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుండె చికిత్స చేయించుకున్న ఖాజాహుస్సేన్‌కు ఆదివారం స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, వలంటీర్ శివలు పింఛన్ అందజేసారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఖాజాహుస్సేన్‌కు పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ జుబేర్ అహ్మద్

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 7: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వాన్ని తప్పకుండా గద్దెదింపుతామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలని కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి 5వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఏసన్న, సవారి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్), జనవరి 7: కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం (2024) అధ్యక్ష, కార్యదర్శులుగా డా.బి. కుమార స్వామిరెడ్డి, సెక్రటరీగా డా.జి. బాలమద్దయ్య, కోశాధికారిగా డా.ఎం. మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డా.సి. సునీల్ కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో ఆదివారం 2024 కేఎంసీ కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. గతంలో ఉన్న అధ్యక్ష కార్యదర్శులు డా. నరసింహులు, డా. మున్నీరుద్దీన్ నుండి కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. నూతన కార్యవర్గం కేఎంసీలో 20 కోట్లతో నాలెడ్జ్ సెంటర్ స్థాపించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

మూడు క్లిష్టమైన ఆపరేషన్లు చేసిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 7: కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో వరుసగా మూడు రోజుల్లో ముగ్గురికి అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్లను సిటీ సర్జన్ డా.సి. ప్రభాకర్ రెడ్డి విజయవంతంగా నిర్వహించారు. ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన 64 ఏళ్ల భాగ్యమ్మకు డిసెంబరు 25న గుండెలో మూడు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయి. హార్ట్ పనితీరు 30 శాతంగా ఉంది. వయస్సు రీత్యా కూడా గుండె ఆపరేషన్ చేయడం కష్టం.. కానీ డా.సి.ప్రభాకర్ రెడ్డి బీటింగ్ హార్ట్ సర్జరీ ద్వారా మూడు నాళాలకు ఆపరేషన్‌ను నిర్వహించారు. వెల్దుర్తి మండలం మల్లేపల్లికి చెందిన పెద్దిరాజు హార్ట్ ఫెల్యూర్‌తో గత నెల 20న ఆసుపత్రికి వచ్చారు. మెట్రల్ వాల్ కు ప్లాస్టిక్ కవాటం మార్చి అతని కాలి నుంచి సిరలను తీసి రెండు రక్తనాళాలకు బైపాస్ సర్జరీని ఈ నెల 5వ తేదీన నిర్వహించారు. ఎమ్మిగనూరుకు చెందిన 30ఏళ్ల ఓ మహిళకు సగం ఊపిరితిత్తులు తీసి లోబెక్టమీ ఆపరేషన్‌ను ఈ నెల 6న డా. ప్రభాకర్ రెడ్డి విజయవంతంగా నిర్వహించారు.



గుండె ఆపరేషన్లు చేయించుకున్న రోగులతో డా.ప్రభాకర్ రెడ్డి

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

కల్లూరు, జనవరి 7: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 35వ వార్డు భగవాన్‌నగర్‌లో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో ఇంటింటికీ తిరిగి ప్రజలు సమస్యలు తెలుసుకుని ఆమె టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు, పారిశుధ్య కార్మికులను వైసీపీ ప్రభుత్వం చులకనగా చూస్తోందని, ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు కె.పార్వతమ్మ, ఎన్వీ రామకృష్ణ, జె. గంగాదర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, పియూ. మాదన్న, ఎస్.ఫిరోజ్, వార్డు నాయకులు కోటేష్‌గౌడ్, రవిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఆళ్ళగడ్డ సభను విజయవంతం చేద్దాం

ఈనెల 9న ఆళ్ళగడ్డలో చంద్రబాబునాయుడు తలపెట్టిన రా కదలి రా... కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మాదవీనగర్‌లోని గౌరు స్వగృహంలో పాణ్యం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు రూరల్, అర్బన్ నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రా కదలి రా మీటింగ్‌కు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



35వ వార్డు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేస్తున్న గౌరుచరిత

రేపు గూడూరులో నారా భువనేశ్వరి పర్యటన

గూడూరు జనవరి 7: గూడూరులో 9న నిజం గెలవాలి నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్ అన్నారు. ఆదివారం గూడూరు మండలంలోని పెంచికలపాడు, గూడూరులో పర్యటించి రూట్ మ్యాప్‌ను కోడుమూరు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆకేపోగు ప్రభాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్ సుధాకర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, టీం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, సుమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకెపోగు ప్రభాకర్

అక్రమ ఖనిజం తరలిస్తున్న వాహనాలు సీజ్

కర్నూలు(అర్బన్), జనవరి 7: అక్రమంగా ఖనిజాన్ని తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశామని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం కోడుమూరు నియోజకవర్గం పరిధిలో ముందస్తు ఫిర్యాదు మేరకు తనిఖీలు చేయగా రెండు వాహనలు పట్టుపడ్డాయని తెలిపారు. ఒక లారీలో రోడ్డు మెటల్ తరలిస్తుండగా సీజ్ చేసి రూ. 15వేల జరిమానా విధించగా, మరో లారీని సీజ్ చేసి నాగలాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి తెలిపారు.

నంది నాటక పోటీల విజేతలకు సత్కారం

కర్నూలు(కల్చరల్), జనవరి 7: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర నంది నాటకోత్సవాల్లో రెండు నంది బహుమతులు గెలుపొందిన కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆదివారం నగరంలోని యునైటెడ్ క్లబ్ సమావేశ హాలులో, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నంది బహుమతులు పొందిన 'ఆనంద నిలయం' పౌరాణిక పద్య నాటకం దర్శకుడు వీవీ రమణారెడ్డిని, ఆ నాటకంలో తొండమాన్ చక్రవర్తి పాత్రధారి పి. భాస్కర్‌లను కళాకారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు భీమేశ్వర, కోశాధికారి సుధాకర్ గౌడ్, రంగస్థల నటులు టీవీ రెడ్డి, ఎం. మనోహర్, గుర్రపుశాల అంకయ్య, పి. హనుమంతరావు చౌదరి, డి. పార్వతయ్య, కళాప్రియ తిరుపాలు, రజనీ నాగరాజు, టీ రాజశేఖర్‌రావు, చిన్ని కృష్ణ, ఆర్ శారదాబాయి పాల్గొన్నారు.

అన్ని వయస్సుల వారికి రిహాబిలిటేషన్ సేవలు

● రాయలసీమలోనే కిమ్స్ సెంటర్

కర్నూలు(హాస్పిటల్), జనవరి 7: వ్యాధులను అధికమించడంలో రిహాబిలిటేషన్ థెరపి, ఫిజియోథెరపీ చాలా దోహదం చేస్తుందని కిమ్స్ హాస్పిటల్ ఎండీ డా.జి.సుధాకర్, డా.రఫీక్ అహ్మద్ అన్నారు. ఆదివారం కిమ్స్ హరితం 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కిమ్స్ యూనిట్ హెడ్ డా.సునీల్ మాట్లాడుతూ రాయలసీమలో చిన్నపిల్లలు, పెద్దలకు అన్ని రకాల సౌకర్యాలతో ఒక చోట రిహాబిలిటేషన్ సెంటర్ కిమ్స్‌లో ఉందని తెలిపారు. గత 5 సంవత్సరాలుగా రాయలసీమ జిల్లాలతో పాటు పక్కనున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు ఇక్కడి వైద్యం చేయించుకుంటున్నారన్నారు. మాటలు రాని పిల్లలకు ఇక్కడ ప్రత్యేకంగా స్పీచ్‌థెరపీ రిహాబిలిటేషన్ కార్డియోరిహాబిలిటేషన్ సదుపాయాలు ఉన్నాయన్నారు. చిన్నపిల్లల న్యూరాలజిస్టు డా.శ్వేతారాంపల్లి మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నపిల్లల్లో న్యూరో సమస్యలు చూస్తున్నామని, ఫిట్స్, అరుదైన న్యూరో సమస్యలకు విజయవంతంగా చికిత్స అందించాలన్నారు.

గుండె సమస్యలపై అలసత్వం చేయవద్దు



జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జయమ్మ

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 7 : గుండె సమస్యలపై అలసత్వం వద్దని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సెక్రటరీ, కార్డియాలజిస్టు డా.పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మతో కలిసి కార్డియాలజిస్టు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సెక్రటరీ డా. చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్డియాలజిస్టు డా.పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ప్రతి నెలలో మొదటి ఆదివారం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని అన్నారు. డా.భవాని ప్రసాద్, డా.శంకర్‌శర్మ, డా.మహేష్ మాట్లాడుతూ సమయానికి ఆహారం తీసుకోకపోవడం, మితిమీరిన ఆల్కహాల్, జంక్‌ఫుడ్స్, కొవ్వు పదార్థాల వల్ల హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు.

'కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి'

కర్నూలు(అర్బన్), జనవరి 7: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా కమిటీ అధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నియోజకవర్గం ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, అనుబంధ సంఘాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు ప్రభుత్వంపై తిరుగుబాటు జెండా ఎగుర వేశారని, వారి న్యాయమైన కోరికలు పరిష్కరించాలని అడిగితే, ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమని అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మహిళా నాయకులు ప్రమీల, వెంకట సుజాత, నాయకులు లాజరస్, ఎజాస్ అహమ్మద్, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబురావు

రగ్బీ పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 7: స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఎన్‌లైట్ అగ్రికల్చరల్ కళాశాల సౌజన్యంతో రగ్బీ అండర్-14 మహిళలు, పురుషుల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ బీవై రామయ్య, అగ్రికల్చర్ కళాశాల ఛైర్మన్ డా. నజీర్ అహ్మద్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా విద్యార్థులు క్రీడారంగాల్లో రాణించాలని, క్రీడాకారులు వ్యక్తిగత నైపుణ్యంతో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణి దీపిక, కోల్స్ ప్రధానోపాధ్యాయులు సీమోన్, గుడిపల్లి సురేందర్, రామాంజినేయులు, దాసరి సుధీర్, టి.గంగాధర్, చిట్టిబాబు, నాగరత్నమయ్య, పరశురాముడు, చిన్నసుంకన్న, నాగ శ్రీనివాసులు, సువర్ణ, వంశీకృష్ణ, సుబాన్‌బాషా పాల్గొన్నారు.

ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు, జేఏసీ జిల్లా అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్‌రాజు, కార్యదర్శులు రంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచి ఇవ్వాలని చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మహమ్మద్ రఫీ, రమణ, వెంకట్రాముడు, మధుమోహన్, భాస్కర్, సాయివేష్, నాగరత్నమ్మ, శాంతిరాజు, రాజారావు, సత్యమ్మ, శాంతి, చిట్టెమ్మ, ఎస్ఎస్ఏ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తాం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిద్దామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంపీటీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమలాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు అబ్దుల్ మునాఫ్, సుబ్రహ్మణ్య శర్మ, జనార్దన్ రెడ్డి, రాఘవరెడ్డి, స్వామినాథన్ పాల్గొన్నారు.



బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

'పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం'

కర్నూలు(కల్చరల్), జనవరి 7: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ బి. రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు హెడ్ పోస్టాఫీసులో బి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సుమారు 50 మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 80 ఏళ్లు దాటిన కొంతమంది సూపర్ సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. సంఘ పటిష్టతకు సబంధించిన సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కే జయరామిరెడ్డి, అధ్యక్షుడిగా బి. రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీగా జి. పద్మనాభశాస్త్రి, సహాయ కార్యదర్శిగా బీఎస్ వరప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా కె. పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశాన్ని యూనియన్ సెక్రటరీలు కే ఈశ్వరయ్య, జి. గిరిబాబు నిర్వహించారు. వై. డేవిడ్ వందన సమర్పణ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

'ప్రగతికి ఉపయోగపడే రచనలు అవసరం'

కర్నూలు(కల్చరల్), జనవరి 7: దేశ ప్రగతికి ఉపయోగపడే రచనలు నేడు ఎంతో అవసరమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో, తెలుగు భాషా వికాస ఉద్యమం, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో 'దేశంకోసం' దివంగత కేసీహెచ్ సుబ్బరాయుడు రాసిన పుస్తకం ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ సభ నిర్వహించారు. తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి

కర్నూలు(అర్బన్), జనవరి 7: రాజకీయ పార్టీలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని జిల్లా కురువ, మదాసి, మదారి కురువ సంఘం జేఏసీ కన్వీనరు కురువ రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంతోష్‌నగర్‌ని ఓ ప్రైవేట్ ఫామ్ హౌస్‌లో కురువ, మాదాసి, మాదారి సంఘాల సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న 14 కురువ సంఘాల ప్రతినిధులు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ అవకాశాల కోసం అన్ని కురువ సంఘాలు జేఏసీగా ఏర్పాటు కావాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ ద్వారా జేఏసీ కార్యవర్గం ఏర్పాటైందన్నారు. జిల్లాలో 5 లక్షలకు పైగా జనాభా ఉన్న కురువ సామాజిక వర్గానికి పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించకపోగా కేవలం ఓటు బ్యాంకుగా కురువలను వాడుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనరు శ్రీనివాసులు, సీజీ శివయ్య, కురు జోషి, బసవరాజు, కురువ రంగస్వామి, కేసీ నాగన్న, మోహన్, శివశంకర్, శివప్రసాద్, కోటిలింగ, తదితరులు పాల్గొన్నారు.

25లోపు సభ్యత్వం తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 7 : శ్రీశైలం వాల్మీకి అన్నదాన సత్రంలో కొత్తగా సభ్యత్వం తీసుకోడానికి ఈ నెల 25వ తేదీలోపు రూ.1,116 చెల్లించాలని వాల్మీకి సేవ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి కృష్ణ ఆదివారం తెలిపారు. ఫిబ్రవరిలో శ్రీశైలం వాల్మీకి సత్రం నూతన కమిటీ నియామకం జరుగుతుందన్నారు.



కర్నూలులో ద్వితీయ బహుమతి సాధించిన ముగ్గు వేసిన ఆర్.గౌతమి



తృతీయ బహుమతి సాధించిన ప్రసన్నకుమారి

విజేతలు వీరే...

కెనరా బ్యాంక్ - ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు.. బెంగుళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు' సారథ్యంలో కర్నూలులోని టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ ఛైర్మన్ టీజీ భరత్ సౌజన్యంతో, మాంటిస్సోరి విద్యాసంస్థల సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో ప్రథమ నగదు బహుమతి ఎస్.రాజేశ్వరి దక్కించుకోగా ద్వితీయ బహుమతి ఆర్.గౌతమి, తృతీయ బహుమతిని ప్రసన్నకుమారి దక్కించుకున్నారు. అదేవిధంగా నగరానికి చెందిన సుజాత, ఎం.ఉమాదేవి, జానకి, ఎస్.రేవతి, సరస్వతి, శ్రీదేవి, ఎం.ఇందిర, శ్రీలక్ష్మి, సుమలత, ఎం.రేణుకలు ప్రశంసాత్మక బహుమతులను అందుకున్నారు.



విజేతకు బహుమతి, నగదుప్రోత్సాహకాన్ని అందజేస్తున్న టీజీ భరత్



కర్నూలులో ముగ్గు వేస్తున్న యువతి





ముగ్గుల పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ





టీజీ భరత్‌కు జ్ఞాపిక బహూకరణ



కర్నూలు జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న మహిళలు



ఆదోనిలో ద్వితీయ బహుమతి సాధించిన పల్లవి





ఆదోని ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన వి.రూపా



ఆదోని ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన రాధికకు నగదు బహుమతి ఇస్తున్న బత్తిన లక్ష్మీనారాయణ

మాజీ నక్సలైట్ హత్య

- డాగ్ స్క్వాడ్‌తో పోలీసు విచారణ
- హత్యకు గురైన రాము ఎమ్మెల్సీ పోతుల సునీత సోదరుడు



పూజారి రాము (ఫైల్)

తుగ్గలి, జనవరి 7: చెట్టుకింద నిద్రిస్తున్న మాజీ నక్సలైట్ పూజారి రాము అలియాస్ భీమన్న (57)ను గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోది హత్య చేశారు. శనివారం రాత్రి పెండేకల్ ఆర్ఎస్ రైల్వే స్టేషన్ ఆవరణలోని వేపచెట్టు కింద నిద్రిస్తున్న పూజారి రాముపై దాడి జరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తన తండ్రి పెద్ద ఈశ్వరయ్య ప్రభావంతో చిన్నతనంలో పీపుల్స్‌వార్ పార్టీ మహానంది దళంలో చేరాడు. 1991లో పోలీసులకు సరెండర్ అయ్యారు. ఆ తర్వాత ఆరోగ్యం దెబ్బతినింది. 1996 నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఎలాంటి వివాదాస్పద సంఘటనలో పాల్గొనని గ్రామస్తులు అంటున్నారు. తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గత ఆరు నెలల క్రితం ఇదే రైల్వేస్టేషన్ ఆవరణలోని దస్తగిరి కట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తిని ఇట్లాగే తలపై రాయి వేసి హత్య చేశారు. రాము ఎమ్మెల్సీ పోతుల సునీతకు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు లెనిన్‌బాబుకు సోదరుడు. ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేష్ పెండేకల్ ఆర్ఎస్‌కు చేరుకుని దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుండుగలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణను అడ్డుకోవడం అన్యాయం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవడం తగదని, ఇది రెడ్డి కులస్థులందరినీ అవమానించినట్లేనని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైరెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం అనంతపురంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంటే.. ముఖ్యమంత్రి ఆదేశాలతో పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రెడ్ల కులస్థుందరినీ అవమానించడమే అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రెడ్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ సంఘటనపై భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామన్నారు.

ఘనంగా చెకుముకి సంబరాలు



బహుమతులు అందజేస్తున్న జేవీవీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: స్థానిక సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముఖి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, ప్రముఖ అష్టావధాని రచయిత బి. హర్ష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సైన్సును బాలబాలికల్లో ప్రచారం చేయాలన్నారు. ప్రతి పనిలోనూ సైన్స్ ఇమిడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్ రాజు, జిల్లా కార్యదర్శి ఖాజా హుసేన్, వెంకటరెడ్డి, విజయకుమార్, రమాదేవి, రమేష్, తారక్ పాల్గొన్నారు.

పదిలంగా స్వర్ణోత్సవ జ్ఞాపకం

- స్థూపాన్ని ఆవిష్కరించిన కళాశాల ప్రిన్సిపాల్
- సావనీర్‌ను విడుదల చేసిన అధ్యాపకులు
- హాజరైన నాటి గురువులు, విద్యార్థులు



స్వర్ణోత్సవ స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప

పత్తికొండ, జనవరి 7 : స్వర్ణోత్సవ సంబరాలను పదిలపరిచేందుకు పత్తికొండ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్థూపాన్ని ప్రిన్సిపాల్ వీరేశప్ప ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో ఆదివారం స్వర్ణోత్సవ స్మారకస్థూపం, సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమాలను డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. కళాశాల స్వర్ణోత్సవ సంబరాలను చరిత్రలో పదిలపరచడానికి పూర్వ విద్యార్థులు కలసికట్టుగా ముందుకు రావడం, స్థూపాన్ని, సావనీర్‌ను ఆవిష్కరింపచేయడం అభినందనీయం అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హాజరైన గురువులకు, కార్యక్రమం కోసం పనిచేసిన పూర్వ విద్యార్థులకు మెమెంటోలు ఇచ్చి సత్కరించారు.



హాజరైన పూర్వవిద్యార్థులు

అందరి సహకారంతోనే చేయగలిగాం

కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు చేయాలనుకున్నాక సీనియర్, జూనియర్ బ్యాచ్‌ల నుండి వివరాలు సేకరించి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశాం. ఇది అందరూ తమ బాధ్యత అనుకోవడం వల్ల చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమం నిర్వహించడలిగాం. ఈ మొత్తం కార్యక్రమానికి గుర్తుగా స్థూపాన్ని ఆవిష్కరించి జ్ఞాపకాలను పదిలపరచడం ఆనందంగా ఉంది. మా కళాశాల ప్రస్థానాన్ని అందరికీ తెలియచేయడానికి సావనీర్‌ను తీసుకొచ్చాం.

- డాక్టర్ రామారావు, కార్యక్రమ నిర్వాహకులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరితమ్మ
- పాలకొలనులో వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ నాయకులు టీడీపీలో చేరిక
- అర్ధరాత్రి షామియానాలను తొలగించిన అధికారులు

ఓర్వకల్లు, జనవరి 6 : టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పాలకొలను గ్రామంలో 500 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాలకొలను గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అనుచరులు చదువుల సుధాకర్ రెడ్డి, ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ సుజాతమ్మ, చింతలపల్లె సర్పంచ్ వెంకటరమణ, కొమరోలు ఎంపీపీ శేషమ్మలతో మరో 500 మంది వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు నాయకులకు మేళతాళాలతో ఘనంగా గ్రామస్థులు స్వాగతం పలికారు. గ్రామమంతా పసుపుమయం జెండాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా గౌరు చరితమ్మ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఆరు మినీ మేనిఫెస్టో పథకాలను ప్రవేశ పెట్టిందని, అధికారంలోకి రాగానే పథకాలను అమలు చేస్తామన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ తమకు కుటుంబ సభ్యులు ముఖ్యం కాదని, పార్టీ నాయకులు, కార్యకర్తలే ముఖ్యమని అన్నారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో భూకబ్జాలు, మట్టి మాఫియా జరుగుతోందని, అవినీతికి మారుపేరుగా వైసీపీ నాయకులు చెలరేగిపోతున్నారని అన్నారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భూకబ్జాలకు ఎమ్మెల్యే కాటసాని సహకరిస్తున్నారని, ఆయన అరాచకాలను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సర్పంచులు, ఎంపీటీసీ నాయకులు

రాజకీయ ఒత్తిళ్లతో షామియానాల తొలగింపు

గ్రామంలో వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరుతున్న నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున అధికారులు, పోలీసులు గ్రామానికి వెళ్లి సచివాలయం ప్రాంగణంలో వేసిన షామియానాలను తొలగించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీశైలంలో రూ. 1.04 లక్షలు చోరీ

శ్రీశైలం, జనవరి 7: శ్రీశైల దేవస్థానం పరిధిలోని సిద్ధరామప్ప వాణిజ్య సముదాయంలోని ఓ దుకాణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లోని జి12 దుకాణంలో రూ. 1.04 లక్షల నగదుతో పాటు సీసీ కెమెరా డీవీఆర్, హార్డ్ డిస్కులను చోరీ చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్యయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందవరం, జనవరి 7: మండలంలోని నదికైరవాడి గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం షఫీ(24) అనే వ్యక్తి మృతి చెందాడు.నదికైరవాడి గ్రామానికి చెందిన షఫీ ఉదయం పూట కొళాయి మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. బంధువులు వెంటనే ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మృతుడికి భార్య గౌసియా, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

గోనెగండ్ల, జనవరి 7: గోనెగండ్ల మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందని వడ్డె వెంకటరాముడు(42) ప్రమాదవశాత్తు పాడుబడ్డ బావిలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన వడ్డె వెంకటరాముడు అలియాస్ గణపతి ఆదివారం గ్రామ శివార్లలో ఉన్న పాడుబడ్డ బావిలో చేపలు పట్టేందుకు కుమారుడు ఉరుకుందుతో కలసి వెళ్లాడు. ఈత రాని వెంకటరాముడు బావిలో వల వేసిన సమయంలో ఫిట్స్ రావడంతో బావిలో పడిపోయాడు. ఇది గమనించిన కుమారుడు ఉరుకుంద గ్రామస్థులను పిలుచుకొని వచ్చాడు. అప్పటికే వెంకటరాముడు నీటిలో మునిగి పోయాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలం చేరుకొని నీటిని మోటర్లతో తోడిపోసి వెంకటరాముడి శవాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు



ముగ్గులకు రంగులు అద్దుతున్న మహిళ











సంక్రాంతి పండుగ విశిష్టతను వివరిస్తున్న బత్తిన లక్ష్మీనారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బత్తిన లక్ష్మీనారాయణ దంపతులు, న్యాయ నిర్ణేతలు



ముత్యాల ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు





ముగ్గులు వేస్తున్న మహిళలు

ముగ్గులోలికే...

● పుడమిని ముద్దాడిన ముత్యాల ముగ్గులు
● ఆదోనిలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
● మహిళల నుంచి అనూహ్య స్పందన
● బహుమతులు అందజేసిన బత్తిన లక్ష్మీనారాయణ, కుబేర్‌నాథ్

ఆదోని/ఆదోని(అగ్రికల్చర్)/ఆదోని టౌన్, జనవరి 7: ఆదోనిలో జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదోని పట్టణం మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు' ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఆదోనిలో ఎన్‌డీబీఎల్ పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్ పరిశ్రమ అధినేత బత్తిన లక్ష్మీనారాయణ, హనుమంతమ్మ స్పాన్సర్స్‌గా సహకారం అందించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి డాక్టర్ బత్తిన సురేంద్రబాబు, బత్తిన కుబేర్‌నాథ్, మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రమేష్‌బాబు బహుమతులను అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా మణియం సుజాత, హెబ్బట్టం కిరణ్మయి, నీలం బండారిలు వ్యవహరించారు. ఆదోనిలో జరిగిన ముగ్గుల పోటీల్లో కె.రాధిక, పల్లవి, బి.రూప ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. అదేవిధంగా ఈరమ్మ, రమ్య, శృతి, ప్రసన్నలక్ష్మి, జ్యోతి, అనిత, సోమేశ్వరి, నాగవేణి, లావణ్య కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలుతో పాటు స్పెషల్, కన్సొలేషన్ బహుమతులుగా రూ.500తో పాటు, జ్ఞాపికను అందజేశారు. మహిళలను విభిన్న రంగాల్లో చేయూతనిచ్చి ప్రోత్సహిస్తే, సత్తాచాటి విజేతలుగా నిలుస్తారని, దేశ ప్రతిష్ఠతను ఖండంతరాలకు చాటిచెబుతారని డాక్టర్ సురేంద్రబాబు, మిల్టన్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మహిళల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసి గుర్తించేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పులికొండ వెంకటేష్, ఆంధ్రజ్యోతి ఆదోని పీసీ ఇన్‌చార్జి బత్తిన మల్లికార్జున, రిపోర్టర్లు విజేంద్రనాథ్‌ప్రసాద్, చిన్న, రవికుమార్, స్వరూప్‌కుమార్, ఏబీఎన్ మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి పండుగ విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ సురేంద్రబాబు

● సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు



సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ముగ్గులకు దూరమై సంప్రదాయాలను మరిచి పోరాదు. ఇంటి ముందు బియ్యం పిండితో ముగ్గు వేస్తే విషపురుగులు, చెడు గాలులు రావనే నమ్మకం. సాంప్రదాయబద్ధమైన సంక్రాంతి పండుగ కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలి. నాకు మొదటి బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- కె.రాధిక, ప్రథమ విజేత

● పోటీల్లో చురుగ్గా పాల్గొంటాను



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ప్రతి ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. విజేతను అవుతానో లేదో కాని ముగ్గులు వేయడానికి రావడమే నాకు సంతోషం. బహుమతులు కాదు ముఖ్యం. మన సంప్రదాయాన్ని విడనాడకుండా మన బిడ్డలకు తెలిసేలా పండుగ సంప్రదాయాన్ని వివరించాలి.

--పల్లవి, ద్వితీయ విజేత

● సంప్రదాయాన్ని విడనాడరాదు



మన సంప్రదాయాన్ని, పద్ధతులను ఎవరూ విడనాడరాదన్నది ఆ ఆకాంక్ష. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇంటికి అందం ముగ్గు. ఇంటికి పంటలు తెచ్చుకునే పండుగే సంక్రాంతిగా భావిస్తాం. ముగ్గుతో పాటు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులతో పాటు పూలు, గొబ్బెమ్మలు అలంకరిస్తే చాలా బాగుంటుంది.

-బి.రూప, తృతీయ విజేత



ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుని విజయ చిహ్నం చూపిస్తున్న మహిళలు



బత్తిన లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం





ముగ్గులు వేస్తున్న మహిళలు

వ్యవస్థలన్నిటినీ జగన్ నాశనం చేశారు



మీనాక్షినాయుడును సన్మానిస్తున్న నాయకులు

ఆదోని, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలన్నిటినీ నాశనం చేశారని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయిపోయాయని, బీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, కేవలం జగన్ దోచుకోవడం, దాచుకోవడం తప్ప, వేరే ఆలోచనే లేకుండా ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సగర సాధికార సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గజ్జలు గణేష్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సగర సాధికారిక మెంబర్ ఉప్పర రవికుమార్, కోడుమూరు మల్లికార్జున, ఆదోని దస్తగిరి, వెంకటేష్, ఆలూరు శేషాద్రి, పత్తికొండ బాలప్ప, ఉప్పర (నగర్) పెద్దలు అల్లప్ప, లోకన్న, మల్లికార్జున, ఇంజనీర్ నాగేంద్రప్ప, గురువస్వామి, క్రాంతినగర్ ఈరన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మళ్లీ వెలుగు

మద్దికెర, జనవరి 7: వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ అంధాకారంలోకి వెళ్లిందని, చంద్రబాబురాకతోనే మళ్లీ రాష్ట్రానికి వెలుగులు వస్తాయని టీడీపీ నాయకులు మూలింటి రంగస్వామి, మంగళి రంగస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాకలి నాగప్ప, ఖలీల్ ఉన్నారు.

అస్పరి: నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ యువ నాయకుడు సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి మహేష్, శేఖర్, లోకేష్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసప్ప అన్నారు. ఆదివారం ఆలూరులో భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి: కోట్ల

ఆలూరు రూరల్, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, మాజీ ఎమ్మెల్యే ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ ఆదివారం పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు ఎక్కువ అయ్యాయని అన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ద్రోహి జగన్ రెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. టీడీపీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు, ఉద్యోగులకు మేలు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

తుగ్గలి, జనవరి 7: ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని బీసీవైఎం పార్టీ రాష్ట్ర నాయకులు కౌలుట్లయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మారెళ్లలో క్రికెట్ టోర్నమెంటు పోటీలను వారు గ్రామ పెద్దల సహకారంతో ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుధాకర్ రెడ్డి, మద్దిలేటి, లింగన్న, తలారి రాముడు ఉన్నారు.

అణగారిన వర్గాల చిరునామా ఎన్టీఆర్

● బీసీలు ఇప్పుడు గుర్తుకొచ్చారా?
- వైసీపీపై మాజీ ఎమ్మెల్యే బీవీ మండిపాటు

ఎమ్మిగనూరు, జనవరి 7: బీసీలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా? అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వైసీపీపై మండిపడ్డారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి ర్యాలీగా సోమప్ప సర్కిల్‌కు చేరుకొని జయహో బీసీ సభను నిర్వహించారు. జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము మంత్రులు గుమ్మనూరు జయరాం, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ఉందా? అని సవాల్ విసిరారు. ఎన్నికలు వస్తున్నాయని నేడు బీసీల జపం చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి 2014లో, 2019లో బీసీలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. 1983లోనే అనేక మందిని బీసీలను ఎంపీలను, మంత్రులను చేసిన ఘనత టీడీపీదేనన్నారు. తన తండ్రి దివంగత బీవీ మోహన్ రెడ్డి పట్టణంలో వాల్మీకులకు స్థలం కేటాయిస్తే నేను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వాల్మీకి భవన్ కోసం రూ. 65లక్షలు మంజూరు చేయిస్తే పనులు చేపట్టకుండా వెనక్కి ఎందుకు పంపారో స్థానిక ఎమ్మెల్యే చెప్పాలన్నారు. పద్మశ్రీ మాచాని సోమప్ప పట్టణవాసుల కోసం, చేనేతల కోసం కోసం వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తే దాన్ని కొట్టేయాలని చూశారని ఆరోపించారు. దాన్ని కోర్టుకెళ్లి అడ్డుకున్నామన్నారు. వాల్మీకుల ఎస్టీ హామీ ఏమైందని ప్రశ్నించారు. టెక్స్‌టైల్ పార్కుకోసం మేము వంద ఎకరాలు కేటాయిస్తే, పార్కు ఏర్పాటు చేయకపోగా.. టెక్స్‌టైల్స్ పార్కుతో తనకు సంబంధం లేదని చెప్పటం ఎమ్మెల్యేకే చెల్లిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం చేసేందేమి లేదన్నారు. బీసీ నాయకులు సత్రం రామకృష్ణ, ముగతి ఈరన్న గౌడ్, సోమేశ్వర రెడ్డి, మల్లికార్జున, మిన్నప్ప, చేనేత మల్లిలు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న నాయకులు

10న నారా భువనేశ్వరి పర్యటన

నందవరం, జనవరి 7: మండలంలోని ముగతి, మాచాపురం గ్రామాల్లో ఈ నెల 10న 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి పర్యటించనున్నారు. రూట్ మ్యాప్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలను పరామర్శించనున్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, గురురాజారావు, కాశీంవలీ, ధర్మాపురం గోపాల్, పీరసాబ్, మాచాపురం వలీ, షాదిక్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న నారా భువనేశ్వరి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అలువాల, ఎర్రబాబు, అగ్రహారం గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు తెలిపారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అలువాల, ఎర్రబాబు, అగ్రహారం గ్రామాల్లో పర్యటించి నారా భువనేశ్వరి పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఎర్రబాడు శ్రీనివాసులు, నూరహమ్మద్, రఫీక్, రంగస్వామినాయుడు, మౌలా, కొత్తింటి ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: చంద్రబాబుఅక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి నారా భువనేశ్వరి 10న మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ మహిళ కార్యకర్త వడ్డే ఈరమ్మ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రూట్‌మ్యాపును పరిశీలించారు.

నందవరం: కార్యకర్తలకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. హాలహర్వి గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్త బోయ నాగేష్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నాగేష్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. రైస్‌మిల్ నారాయణరెడ్డి, ధర్మాపురం గోపాల్, దావీదు, రాగప్ప, నాగరాజు, వెంకట్రాముడు, ప్రభుదాష్, గోవిందు, ఆనంద్‌రాజు, దుబ్బన్న పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: ఈ నెల 9వ తేదీన మండలంలోని ఎస్.హెచ్ ఎర్రగుడి గ్రామానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి వస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు తెలిపారు. ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు గ్రామంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి అలంకొండ నబి సాహెబ్, కర్నూలు పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణాపురం దామోదర్ నాయుడు ఉన్నారు.

తుగ్గలి : పేదలకు, పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం కడమకుంట్ల, బోడిబండతండాలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక హఠాత్తుమరణం చెందిన వడ్డె చిన్నరాముడు, మాజీ ఎంపీటీసీ రమావత్ లక్ష్మి కుటుంబ సభ్యులను ఆయన పరామార్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, తిరుపాల్‌నాయుడు తదితరులు ఉన్నారు.

జిల్లా కురువ సంఘాల పొలిటికల్ జేఏసీ కో-కన్వీనర్‌గా నిట్రవట్టి బసవరాజు

ఆలూరు, జనవరి 7: జిల్లా కురువ సంఘాల పొలిటికల్ జేఏసీ కో-కన్వీనర్‌గా నిట్రవట్టి బసవరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పంచలింగాల నాగరాజు ఆధ్వర్యంలో మదాసి, మదారి కురువ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. 14 సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అన్ని సంఘాల ఆమోదంతో కులసంఘాల పొలిటికల్ జేఏసీ కమిటీను ఎన్నిక చేశారు. కమిటీ కన్వీనర్‌గా రవికుమార్ ఎన్నికల పద్ధతిలో ఎన్నుకోగా ఆలూరు తాలూకా నుంచి బసవరాజు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు నిల్

ఆదోని టౌన్, జనవరి 7: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో నాయకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రాయలసీమ కో-ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసీ శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం నాయకులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులు నిత్యం దోమలు, పందికొక్కులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోగుల బంధువులకు తాగునీటి సౌకర్యంతో పాటు డైనింగ్ హల్ వసతి కల్పించలేదన్నారు. గత కొన్నేళ్ల నుంచి ఆపరేషన్ థియేటర్ నిర్మాణం పనులు కొనసాగుతునే ఉన్నాయని ఆరోపించారు. రోగులకు అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేక్షావలి, మంజునాథ్, జగదీష్, పాల్గొన్నారు.

'రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



మాట్లాడుతున్న జంగమ సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య స్వామి

మంత్రాలయం, జనవరి 7: రాష్ట్రంలో జంగమ మహేశ్వరులు లక్షల సంఖ్యలో ఉన్నారని, రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని జంగమ మహేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య స్వామి కోరారు. ఆదివారం మంత్రాలయం రాగసుధ సమావేశ మందిరంలో శ్రీశైలం పాలక మండలి సభ్యులు సుజాత శంకర్ అధ్యక్షతన జంగమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య స్వామి మాట్లాడుతూ జంగమ మహేశ్వర సంఘం రాజకీయ ఎదుగుదలకు ఎంత మంది ముందుకు వస్తున్నా రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని ఆరోపించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు మంజునాథ స్వామి, ప్రధాన కార్యదర్శి బసవ రాజు, సహాయ కార్యదర్శి విశ్వేశ్వరయ్య స్వామి, ఎండీ బసవరాజు, కోశాధికారి ఆడిట్ శంకర్, మహేష్, మంజునాథ, గురునాథయ్య స్వామి, పెద్ద ఎత్తున జంగమ సభ్యులు పాల్గొన్నారు.

ప్రేమ జంటకు టీడీపీ నాయకుల చేయూత

మంత్రాలయం, జనవరి 7: మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన సీతమ్మ, నాగేంద్ర దంపతుల కుమారుడు మల్లేష్ అదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవితో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం ఆదివారం మాధవరం టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి ప్రేమజంటకు మంగళసూత్రం, ముక్కుపుడకను అందించి దీవించారు. అనంతరం రాఘవేంద్రరెడ్డిని శాలువ, పూలమాలతో సన్మానించారు.

శ్రీమఠం గోశాలకు పశుగ్రాసం

మంత్రాలయం, జనవరి 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం గోశాలకు కర్ణాటకలోని రాయచూరు జిల్లా తిరువార్ తాలుకా ఎన్. డాక్టర్ క్యాంపునకు చెందిన రూ.2లక్షలు విలువ చేసే 14 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని విరాళంగా దాతలు అందజేశారు. ఆదివారం కర్ణాటక నుంచి పశుగ్రాసాన్ని మంత్రాలయం తీసుకువచ్చి రాఘవేంద్రస్వామి మఠం గోశాలకు అందజేశారు. గురెడ్డి భీమిరెడ్డి ఆధ్వర్యంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, గోశాల సూపర్‌వైజర్ దేశాయ్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారు..

ఆదోని టౌన్, జనవరి 7: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేలు అనేకమంది ఆసక్తిగా ఉన్నారని, సార్వత్రిక ఎన్నికల లోపు కాంగ్రెస్‌లో భారీ చేరికలు ఉండడం ఎంతో సంతోషదాయకమని డీసీసీ అధ్యక్షుడు బాబురావు అన్నారు. ఆదోని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం, నియోజకవర్గం ఇన్‌చార్జి నీలకంఠప్ప అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. బాబురావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషులు, అభిమానులు, తటస్థంగా ఉన్నవారు తిరిగి కాంగ్రెస్ వైపుకు రావడంతో కాంగ్రెస్ బలోపేతం అవుతోందన్నారు. ఆదోని పట్టణంలో చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోని ప్రధాన సమస్యలు బైపాస్ రహదారి నిర్మాణం, రహదారుల విస్తరణ, తాగునీటి సమస్య, ఇళ్ల పంపిణీలపై ప్రజలను కూడకట్టుకొని ఉద్యమం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని నాయకులకు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, జిల్లా సేవాదళ్ అధ్యక్షురాలు సుజాత, జిల్లా ఆదివాసి కాంగ్రెస్ ఛైర్మన్ మారుతీ రావు, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ లాజరస్, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు మున్నా పాల్గొన్నారు.